



దేహధూళి, కచ భారం, నోళుల వ్రేళులు, పాల బుగ్గలూ, ఎక్కడ చూస్తే అక్కడ మీరై విశ్వ రూపమున విహరిస్తుండే పరమాత్ములు ఓ చిరుతల్లారా... మీదే మీదే సమస్త విశ్వం.. మీరే లోకపు భాగ్య విదాతలు అని శ్రీశ్రీ అన్నట్లు చిన్న పిల్లలు తమ స్నేహితులతో దుమ్మనకా, దూళనకా, వెలుగు చీకట్లను లెక్క చేయకుండా తాము విహరించే ప్రతి ప్రదేశం తమదే అనుకొనే బాల్యం ప్రతి ఒక్కరికీ ఓ మధుర స్మృతి. అలాంటి బాల్యంలో ఆడిన ఆటలు, చేసిన చేష్టలు మరపురాని తీయని భావనలు. వాటిని నెమరవేసుకుంటున్న గత, నేటి తరాలు. మరి భవిష్యత్ తరాల మాటేమిటి..?

**- యాలాల, డిసెంబర్ 19**





# అదృశ్యానికి అంచులో ప్రాచీన క్రీడలు

## గ్రామీణ ప్రాంతాల్లో ఆటలకు దూరమవుతున్న చిన్నారులు



గ్రామీణ ప్రాంతాల్లో కొద్దో గొప్పో ప్రాచీన ఆటలు కనబడుతుంటాయి. నేడు క్రమక్రమంగా అవికూడా అందనంత దూరానికి తరలిపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు పిల్లలకు ఆనందాలను పంచితే, చిన్న కుటుంబాలు రోగాలను పంచుతున్నాయి. స్మార్ట్ ఫోన్ పుణ్యమా అని ఇంట్లో ఒకరినొకరు పలకరించుకొనే సమయం లేకుండా పోయింది. పెద్దలు టీవీ సీరియల్ల మాయలో పడి తమ బరువు బాధ్యతలను గాలికొదిలేసి టీవే ప్రపంచంగా టీవీ సీరియల్లతో యుద్ధం చేస్తూ.. గెలుస్తూ, ఓడుతూ చివరకు అంతేగా అంతేగా అంటూ పిచ్చి లోకంలో విహరిస్తున్నారు. ఆ ప్రభావం పిల్లల మీద అమితంగా పడుతుంది. తామ సంతోషాలు, కష్టాలు, ఇష్టాలను, పాఠశాలలో జరిగిన చిన్న చిన్న ఆనంద క్షణాలను ఎవరితో పంచుకోవాలో అర్థం కాక స్మార్ట్ ఫోన్ గేమ్‌ల వైపు ఆకర్షితులై తమ బంగారు భవితను కోల్పోతున్నారు. స్మార్ట్‌ఫోన్ గేమ్‌లు, ఆన్‌లైన్ బెట్టింగులుగా రూపాంతరం చెంది వెనకకు రాలేక ముందుకు వెళ్లలేక మానసిక ఒత్తిడికి లోనై కనిపించనంత దూరానికి తరలివెళ్లాక అప్పుడు వారి తల్లిదండ్రులకు పిల్లలు గుర్తొస్తున్నారు. అప్పటికే జరుగార్సిన నష్టం జరిగిపోతుంది.

**అనారోగ్య సమస్యలకు కేరాఫ్..**

స్మార్ట్‌ఫోన్, టీవీలు.. పిల్లల అనారోగ్యానికి కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. చిన్న తరగతి గదులు, స్టడీ అవర్స్‌తో బాల్యాన్ని చిధిమి మార్కులనే మెడల్‌ను మెడలో వేసి చిన్నతనం ఆనందాలు, క్రీడలను దూరం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే ఊబకాయం, షుగర్, బీపీ వంటి సమస్యలతో అంతు చిక్కని రోగాలతో యుద్ధం చేస్తూ గెలువలేక, గెలిచి బ్రతకలేక జీవిస్తున్నారు. రెండు పదుల వయస్సులో అరవై పదుల వయస్సును అందించడమే లక్ష్యంగా పని చేస్తున్న స్మార్ట్‌ఫోన్, టీవీలను వారికందిస్తున్న తల్లిదండ్రులది తప్పా.. చదువు చదువు అంటూ 12 నుంచి 18 గంటలు నిరంతరాయంగా ఒత్తిడికి గురిసేస్తున్న ఉపాధ్యాయులది తప్పా. తప్పేవరిది ఒప్పేవరిదీ...

**క్రీడలను హరిస్తున్న కాంక్రిట్ జంగల్**

ఆధునిక నాగరికత కొత్తరూపు సంతరించుకొంటూ బాల్య క్రీడలను పిల్లర్లుగా, చిన్నారుల ఆనందాలను మెట్లగా, ఆత్మీయతను స్లాబ్‌గా, అనురాగాన్ని గోడల మధ్య కానరాని ఇటుకలుగా మలచుకొని, వ్యాయామాన్ని రంగులలో మేలవించి చక్కని ఇంటిని నిర్మించుకొని చిన్నారులను పట్టణాల భవంతులలో ఖైదు చేస్తున్నదెవ్వరూ... మనం కాదా. పల్లెలను పట్టణాలుగా, పట్టణాలను మహానగరాలుగా మారుస్తూ కాంక్రిట్ జంగల్‌ను సృష్టిస్తుంది అక్షరాలా మనమే. పట్టణాల్లో ఇండ్లు, వెలుపలా ఆడటానికి అవకాశాలు చాలా తక్కువ. నగరాల పెరుగుదల కారణంగా సురక్షితమైన స్థలం లభ్యతలో క్షీణతకు దారితీసింది. ఆట కోసం స్థలం సమస్యగా మారింది. కొద్దోగొప్పో అక్కడక్కడా పల్లె పాఠశాలలో కొంత ఆటస్థలం ఉండడంతో ఇంకా కొన్ని గ్రామీణ క్రీడలు మిగిలి ఉన్నాయి.

**ప్రాచీన క్రీడలు ఎక్కడ..**

40, 50 సంవత్సరాల క్రితం ఉన్న ఆటలను అప్పటి వారు ఇప్పుడు ఎంతో గొప్పగా చెబుతారు. ఆనాటి ఆటలైన కోతికొమ్మచ్చి, దాగుడు మూతలు, తాడు బొంగరం, సీసం గోలీలు(గోలీలాట), కర్రాబిల్లా, టైర్ ఆటలు(చక్రం ఆట), తాడు ఆట, రింగాట, చమ్మ చెక్క, వంగుళ్లు.. దుంకుళ్లు, తొక్కుడు బిల్లా, ఖోఖో, చిల్లా కట్టే, కబడ్డీ, బారా కట్ట, కుంటల్లో కేరింతలు, లడ్డాట, సంచులాట, దొంగా పోలీసాట ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. కాలం మారింది, మనిషి ఆలోచనా విధానం మారింది.

**నేటి కాలం పిల్లలు రోబోలు**

రోబోలకు మనం ఏమి చెబితే అవి చేస్తాయి. అలా నేటి పిల్లలు ఇంటికి, బడికి మాత్రమే పరిమితం అవుతున్నారు. పెద్దలూ పిల్లలతో మాట్లాడే సమయం లేక పిల్లలతో ఆడుకోవాలనే ఆలోచన లేక ఉద్యోగ సంబంధ చిరాకులతో స్మార్ట్ ఫోన్‌తో దోస్తీ చేయడంతో వారి పిల్లలూ తమ సమయాన్ని కూడా కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్, లాప్‌టాపుల వైపు కేటాయించడంతో ఆటల వైపు వారి దృష్టి వెళ్లడం లేదు. క్రమంగా క్రీడలు అంతరించి పోతున్నాయి. కంటి సమస్యలతో పాటు మానసిక శారీరక సమస్యలు తలెత్తుతున్నాయి.

**ఏమి చేద్దాం..**

ఏమి చేద్దామని నన్ను అడగడం కాదు. మనం ఏమి చేయాలో ఆలోచిద్దాం. క్రీడలను ప్రోత్సహిద్దాం. ఆ దిశగా ముందుకు సాగుదాం. మనతో పాటు మరో పది మందికి ఆ మార్గాన్ని చూపెడదాం.







# వాము సాగు.. లాభాలు బాగు

## జిల్లాలో 2వేల ఎకరాల్లో సాగు

బొంరాస్‌పేట, డిసెంబర్ 19 : వ్యవసాయంలో మిగతా పంటలతో పోలిస్తే వామును తక్కువ శ్రమతో పండించవచ్చు. ఎటువంటి నేలలోనైనా ఎటువంటి వాతావరణంలోనైనా వాము పంటను సాగు చేయవచ్చు. వర్షాధారం అయితే నల్లరేగడి నేలలు, నీటి పారుదల వసతి ఉంటే తేలికపాటి నేలలు ఈ పంటను సాగు చేయడానికి అనుకూలంగా ఉంటాయి. మంచుతో కూడిన వాతావరణం అయితే చాలా అనుకూలమని చెప్పవచ్చు. అందుకే వాము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వాముకు మార్కెట్‌లో కూడా మంచి ధర ఉండడంతో రైతులు దీనిని సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 2వేల ఎకరాల్లో వాము పంటను రైతులు సాగు చేస్తున్నారు. బొంరాస్‌పేట మండలంలోని రేగడిమైలారంలో 50 ఎకరాల్లో రైతులు వాము పంటను సాగు చేస్తున్నారు. ఆగస్టులో పొలంలో విత్తనాలు చల్లితే ఐదు నెలల్లో పంట చేతికి వస్తుంది. విత్తనం నాటిన రెండు నెలలకు ఒకసారి కలుపు తీస్తే సరిపోతుంది. ఎరువులు, మందుల పిచికారీ తదితర ఖర్చులు చాలా తక్కువగా ఉంటాయి. పంట కోత సమయంలోనే కూలీల ఖర్చు భరించాల్సి ఉంటుంది.

**మార్కెట్‌లో మంచి డిమాండ్**

వాముకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాలుకు రూ.18వేల నుంచి రూ.19వేల వరకు ధర పలుకుతుంది. ఇక్కడ పండించిన వామును వికారాబాద్, పరిగి మార్కెట్లకు తరలించి అమ్ముకుంటారు. ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పొలం తీరును బట్టి వచ్చే దిగుబడి ఆధారపడి ఉంటుంది.

**22 క్వింటాళ్లు దిగుబడి**

వాము పంట సాగు చేసిన 160 రోజులలో చేతికి వస్తుంది. పంటలో రెండుసార్లు కలుపు తీయాల్సి వస్తుంది. మందులు కూడా పిచికారీ చేశాను. ఎకరాకు 3 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. నేను 10 ఎకరాల్లో సాగు చేస్తే 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షాల వల్ల పంట దిగుబడి కొంత తగ్గింది. క్వింటాలుకు రూ.16 వేల ధర వచ్చింది.

**-రాచప్ప, రేగడిమైలారం**

# ఆత్మీయ జ్ఞాపకం.. స్మృతివనం


స్మృతి వనం ప్రధాన ద్వారం

- ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న వైనం
- వ్యక్తుల జ్ఞాపకార్థం మొక్కలు నాటేందుకు అవకాశం
- సేద తీరేందుకు, వనభోజనాలకు సౌకర్యాలు
- ఆకట్టునేలా కట్టడాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

ధారూరు, డిసెంబర్ 19 : మనిషి మనుగడకు మొక్కలే జీవనాధారం మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ఆత్మీయుల జ్ఞాపకార్థం మొక్కలు పెంచితే ఆ అనుభూతే వేరు. అందుకే ప్రభుత్వం అలాంటి అవకాశాన్ని కల్పిస్తున్నది. ఆత్మీయుల జ్ఞాపకాలు చెదిరిపోకుండా ఉండడానికి స్మృతివనం ఏర్పాటు చేశారు. వనభోజనాలు చేయడం పచ్చనిచెట్లతో ఆహ్లాదకరంగా విరాజిల్లే ఈ అడవిలో సేదతీరడం ఇక్కడి ప్రత్యేకత. అటవీశాఖ ఆధ్వర్యంలో ధారూరు మండల కేంద్రం సమీపంలో స్మృతివనం ఏర్పాటు చేసి మృతి చెందిన ఆత్మీయుల పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకోసం స్మృతివనాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నది. వికారాబాద్ జిల్లా ధారూరు మండల కేంద్రంలోని సోమశంకరప్ప ఆలయం సమీపంలో వికారాబాద్-తాండూరు ప్రధాన రహదారి పక్కన స్మృతివనాన్ని మూడు సంవత్సరాల క్రితం 12ఎకరాల 20గుంటల్లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో అప్పటి వికారాబాద్ కలెక్టర్ ఒమర్ జలీల్ రూ.12లక్షలు స్మృతి వనం అభివృద్ధికి మంజూరు చేశారు. ఈ నిధులతో స్మృతి వనంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేశారు. అందమైన కట్టడాలు, పర్యాటకులు సేదతీరడం కోసం చెట్ల దగ్గర చిన్న చిన్న కట్టలు నిర్మించారు.


కూర్చోడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలం

**1.8లక్షల మొక్కల పెంపకం**

స్మృతి వనాన్ని 12ఎకరాల 20గుంటల స్థలంలో స్మృతివనాన్ని ఏర్పాటు చేశారు. రూపుదిద్దుకున్న స్మృతివనంలో పర్యాటకులకు, పితృదేవతల పేరిట మొక్కలు నాటిన వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చుట్టూ అడవిని ఆశ్వాదిస్తూ చల్లని గాలిని పీలుస్తూ వన భోజనాలు చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. ఈ స్మృతి వనంలో ప్రధాన గేట్, రచ్చబండలు, బోరు, మోటరు, పైప్‌లైన్, గజబోను లను నిర్మించారు. స్మృతివనం చుట్టూ రెండు మీటర్ల లోతు, వెడల్పుతో పహారి(జాలీలతో)కాకుండా కందకాలు తవ్వించారు. స్మృతివనంలో దాదాపు 1.8లక్షల వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. స్మృతివనానికి వేసవి కాలంలో అధికంగా వస్తుంటారని స్థానికులు తెలుపుతున్నారు.



సేద తీరేందుకు ఏర్పాటు చేసిన కట్ట


వనంలో ఆడుకుంటున్న బాలుడు


వివిధ రకాల మొక్కలు

**మృతుల పేరిట మొక్కలు..**

మృతి చెందిన వారి పేరిట మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు స్మృతివనంలో అవకాశం కల్పించారు. ఆత్మీయుల పేరిట మొక్కలు నాటి సంరక్షించాలనుకునే వారు రూ.5వేలు అటవీశాఖ ఖాతాలో జమ చేయాలి. అనంతరం సిబ్బందితో ఆత్మీయుల పేరిట స్మృతి వనంలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుంటారు. స్మృతివనంలో వివిధ రకాల మొక్కలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతున్నారు. స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా వచ్చి వారి జ్ఞాపకాలను తలచుకుంటూ మొక్కల వద్ద గడపవచ్చు. వికారాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణకుమారి వారి నాన్న పేరిట జ్ఞాపకార్థంగా మామిడి మొక్క, అన్న పేరిట జ్ఞాపకార్థంగా అల్లనేరేడు మొక్కను నాటారు.


జ్ఞాపకార్థం నాటిన మొక్క

**12 ఎకరాల్లో స్మృతివనం ఏర్పాటు**



12ఎకరాల 20గుంటల స్థలంలో ధారూరులో స్మృతివనాన్ని ఏర్పాటు చేశాం. కొందరు ఆత్మీయుల జ్ఞాపకాలు ఎన్నటికీ మరుపురావు. అలాంటి వారి పేరిట మొక్కలు నాటి ఆ చెట్టు నీడన సేద తీరితే ఆ అనుభూతే వేరు. మొక్కలు పెంపకం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఎవరైనా తమ పూర్వికుల పేరిట ఈ స్మృతివనంలో మొక్కలు నాటే అవకాశం ఉంది. వాటి సంరక్షణ కోసం రూ.5వేలు అటవీశాఖ ఖాతాలో జమచేయాలి. వారు ఎంపిక చేసుకున్న చెట్ల సంరక్షణ ఎలా ఉందో పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

**- టి. కృష్ణ, అటవీశాఖ రేంజ్ అధికారి, ధారూరు**